క్లుప్తంగా

ఉత్సాహంగా డ్యాన్స్ పోటీలు



విజేతలకు బహుమతులు అందిస్తున్న సర్పంచ్ చింత హేమారావు

వజ్రపుకొత్తూరు: ఉద్దానం రామకృష్ణాపురంలో గురువారం డ్యాన్స్ పోటీలు నిర్వహించారు. సంక్రాంతి ఉత్సవాల సందర్భంగా నిర్వహించిన ఈ కార్యక్రమంలో సుమారు 25 మంది చిన్నారులు, యువకులు పాల్గొని జానపద, సినీ గీతాలకు నృత్యాలు చేశారు. ప్రథమ, ద్వితీయ స్థానాల్లో నిలిచిన యూఆర్‌కేపురం గ్రామానికి చెందిన బొడ్డు జోగారావు, దున్న కోమలిలకు సర్పంచ్ చింత హేమారావు, మాజీ సర్పంచ్ చింత నారాయణ బహుమతులు అందించారు. కార్యక్రమంలో గ్రామ పెద్దలు, యువకులు పాల్గొన్నారు.

స్నేహితుడికి చేయూత



మిత్రుడికి ఆర్థిక సాయం చేస్తున్న పూర్వ విద్యార్థులు

వజ్రపుకొత్తూరు: తమతో చదువుకున్న తోటి మిత్రునికి పూర్వ విద్యార్థులు అండగా నిలిచారు. గురువారం గోవిందపురం ఉన్నత పాఠశాలలో 1989–90లో 10వ తరగతి చదువుకున్న విద్యార్థులతా ఓ చోట చేరి ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. ఈ సందర్భంగా అంగవైకల్యంతో బాధపడుతున్న కణితివూరు గ్రామానికి చెందిన తోటి మిత్రుడు కణితి భాస్కరరావు కుటుంబానికి రూ.15వేలు నగదు, రూ.5వేలు విలువైన దుస్తులుఅందించారు. కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు మద్దిల హరినారాయణ, కీలు లోకనాథం, సరిత, శకుంతల, పి.వెంకటరావు, ఢిల్లేశ్వరరావు, భీమారావు తదితరులు పాల్గొన్నారు.

బీమా సాయం అందజేత



తక్షణసాయం అందజేస్తున్న సర్పంచ్

టెక్కలి: మండలంలోని బొప్పాయిపురంలో బలగ పుష్పలత భర్త ఇటీవల గుండెపోటుతో మృతిచెందారు. గురువారం వైఎస్సార్ బీమా కింద తక్షణ సాయం రూ.10 వేలను సర్పంచ్ జి.మోహనరెడ్డి అందజేశారు.

యువకుడి ఔదార్యం



ప్లేట్‌లెట్స్ దానం చేస్తున్న దిలీప్

కాశీబుగ్గ: ప్లేట్‌లెట్స్ పడిపోయి ప్రమాదంలో ఉన్న ఏడాది వయసున్న చిన్నారికి ప్లేట్‌లెట్స్ దానం చేసి ఆదుకున్నాడో యువకుడు. పలాస-కాశీబుగ్గ మున్సిపాలిటీలోని ఓ ఆస్పత్రిలో చిన్నారి ఆరోగ్య పరిస్థితి విషమించింది. విషయం తెలుసుకున్న వజ్రపుకొత్తూరు మండలం పూడిలంక గ్రామానికి చెందిన బి.దిలీప్ గ్రామం నుంచి సముద్రం మీదుగా మర పడవపై వచ్చి కాశీబుగ్గ చేరుకుని ప్లేట్‌లెట్స్ దానం చేశాడు. దీంతో చిన్నారి కుటుంబ సభ్యులు యువకుడిని అభినందించారు.

అర్హులందరికీ వంద రోజుల 'ఉపాధి'



సమావేశంలో మాట్లాడుతున్న ఏపీఓ శ్రీనివాసరావు

ఇచ్ఛాపురం రూరల్: ఉపాధి హామీ పథకంలో వేతనదారులకు గరిష్ట వేతనం అందేలా ఫీల్డ్, టెక్నికల్ అసిస్టెంట్లు దృష్టి సారించాలని ఏపీఓ పి.శ్రీనివాసరావు సూచించారు. గురువారం ఇచ్ఛాపురం ఉపాధి కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. అర్హులందరికీ వంద రోజుల పని దినాలు కల్పించాలని, సరాసరి రూ.272 వేతనం వచ్చేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఈ నెలాఖరున జరగనున్న సామాజిక తనిఖీలకు సంబంధించి రికార్డులు పక్కాగా తయారు చేయాలని సూచించారు.

బెంకిలి కార్యదర్శికి అభినందనలు

సోంపేట: మండలంలోని బెంకిలి పంచాయతీ సచివాలయ కార్యదర్శి బి.శ్రీనివాసరావును ఎంపీపీ నిమ్మన దాస్, ఎంపీడీఓ బి.వెంకటరమణ గురువారం అభినందించారు. చెత్తతో సంపద తయారీ కేంద్రం నిర్వహణలో బెంకిలి క్లాప్ మిత్ర కేంద్ర ప్రభుత్వం అందజేస్తున్న అవార్డుకు ఎంపిక కావడం అభినందనీయమన్నారు. ఈ నెల 26న ఢిల్లీలో ప్రధానమంత్రి సమక్షంలో అవార్డు అందుకోనున్నట్లు ఆయన తెలిపారు.

ఆదుకున్న ఆసరా

- మహిళల జీవితాల్లో వెలుగులు నింపిన వైఎస్సార్ ఆసరా పథకం
- నాలుగో విడతపై గ్రామాల్లో అవగాహన



వైఎస్సార్ ఆసరాపై అవగాహన సదస్సు



మందస: రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన పథకాలు సత్ఫలితాలిస్తున్నాయి. ప్రజాసంకల్పయాత్రలో భాగంగా ఇచ్చిన హామీలను సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి క్రమం తప్పకుండా అమలు చేస్తుండటంతో స్వయం శక్తి సంఘాల మహిళలు హర్షం వ్యక్తం చేస్తున్నారు. గత ఎన్నికల సమయంలో డ్వాక్రా సంఘాలు తీసుకున్న బ్యాంకు రుణాలను నాలుగు విడతలుగా చెల్లిస్తామన్న హామీ మేరకు వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక మూడు విడతలుగా వైఎస్సార్ ఆసరా పథకం వర్తింపజేశారు. ఈ పథకంతో మహిళల కుటుంబాలు ఆర్థికాభ్యున్నతి చెందుతున్నాయి. తాజాగా నాలుగో విడత నిధులు విడుదల చేయడానికి ప్రభుత్వం సిద్ధమవుతోంది. ఈ మేరకు సెర్ప్ అసిస్టెంట్ ప్రాజెక్టు మేనేజర్ గొడబ ప్రసాదరావు ఆధ్వర్యంలో ప్రతి పంచాయతీలో అవగాహన సదస్సులు నిర్వహిస్తున్నారు. ప్రభుత్వం అందిస్తున్న ఆసరాతో మహిళల్లో ఆనందం వ్యక్తమవుతోంది.

వైఎస్సార్ ఆసరా వివరాలు	
మండలం	మందస
పంచాయతీలు	41
రెవెన్యూ గ్రామాలు	227
స్వయంశక్తి సంఘాలు	1577
లబ్ధి పొందిన మహిళలు	16,638
ఒక్కో ఏడాది చేసిన జమ	రూ.9,16,34,237
వైఎస్సార్ ఆసరా మొత్తం	రూ.36,65,36,948

ఆదుకున్న సీఎం జగన్



ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మహిళలకు ఆర్థిక భరోసా కల్పించారు. మూడు విడతలుగా వైఎస్సార్ ఆసరా నిధులు అందాయి. రూ.27,300 వంతున వచ్చిన డబ్బులతో పేపరు ప్లేట్లు మేకింగ్ యూనిట్ పెట్టుకున్నాను. మా కుటుంబాన్ని పోషించుకోగలుగుతున్నాను. ముఖ్యమంత్రికి రుణపడి ఉంటాను.

– వాదాడ భాగ్యలక్ష్మి,
అన్నపూర్ణ స్వయంశక్తి సంఘం, మందస–2

ప్రభుత్వ సాయం మరువలేనిది



ప్రభుత్వం అందిస్తున్న ఆర్థిక సాయం మరువలేనిది. నేను మజ్జి గౌరమ్మ గ్రూపులో సభ్యురాలిని. వైఎస్సార్ ఆసరా పథకం నాకు వర్తించింది. మూడు దఫాలుగా రూ.45వేలు అందాయి. ఈ నిధులతో టైలరింగ్ షాపు పెట్టుకున్నాను. కుటుంబ పోషణలో నావంతు పాత్ర పోషిస్తున్నాను.

– కొల్ల శ్యామల,
భైరిసారంగపురం, మందస మండలం

నాలుగో విడతకు సిద్ధం



వైఎస్సార్ ఆసరా పథకం కింద నాలుగో విడత నిధులు విడుదలకు ప్రభుత్వం సమాయత్తం అవుతోంది. ఇప్పటికే మూడు విడతల నిధులు మహిళల ఖాతాల్లో జమ అయ్యాయి. ఈ పథకం మహిళలకు ఎంతగానో తోడ్పడుతోంది. పంచాయతీల వారీగా పథకంపై అవగాహన కల్పిస్తున్నాం.

– గొడబ ప్రసాదరావు,
అసిస్టెంట్ ప్రాజెక్ట్ మేనేజర్, సెర్ప్, మందస

బెంతో ఒరియాల సమస్యలు పరిష్కరించాలి



ఇచ్ఛాపురం: మానవహారంగా ఏర్పడిన బెంతో ఒరియా కులస్తులు



కవిటి : దీక్షా శిబిరంలో మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ కన్వీనర్ కడియాల ప్రకాష్

ఇచ్ఛాపురం/కవిటి/కంచిలి: బెంతో ఒరియా కులస్తుల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ గురువారం కవిటి మండలం నుంచి ఇచ్ఛాపురం వరకు బైక్‌ర్యాలీ నిర్వహించారు. బస్టాండ్ కూడలికి చేరుకుని మానవహారం చేశారు. అనంతరం తహసీల్దార్ కార్యాలయం ఎదుట బైఠాయించి నిరసన వ్యక్తం చేశారు. సమస్యలు పరిష్కరించి కుల ధ్రువీకరణ పత్రాలు మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. సర్టిఫికెట్లు లేక బెంతో ఒరియా విద్యార్థులు నష్టపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. అనంతరం తహసీల్దార్ గురుప్రసాద్‌కు వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో కుల పెద్దలు రజనీకుమార్ దోళాయి, శివబిసాయి, మోహన్ సాహు, సుమన్ బిసాయి తదితరులు పాల్గొన్నారు. అంతకుముందు కవిటిలో ఏర్పాటు చేసిన బెంతో ఒరియాల దీక్షా శిబిరాన్ని వైఎస్సార్ సీపీ కన్వీనర్ కడియాల ప్రకాష్, మాజీ ఎంపీపీ పీఎం తిలక్ సందర్శించి సంఘీభావం తెలిపారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నేతలు పూడి లక్ష్మణరావు, బద్రి ప్రకాష్, వై నీలయ్య తదితరులు పాల్గొన్నారు. బెంతొరియాలకు నిలిపివేసిన కులధృవీకరణ పత్రాలు తిరిగి జారీ చేయాలని జిల్లా బెంతొరియా సంఘ కార్యదర్శి శివ బిసాయి డిమాండ్ చేశారు. ఈ మేరకు బెంతొరియా సంఘం ఆధ్వర్యంలో గురువారం చేపట్టిన నిరసన బైక్ ర్యాలీ కవిటి, ఇచ్ఛాపురం మీదుగా కంచిలి చేరుకుంది. ఈ సందర్భంగా తహశీల్దార్ కార్యాలయంలో వినతిపత్రం అందించారు.

కొత్తమ్మ తల్లి సన్నిధిలో అన్నదానం



అన్నదానం నిర్వహిస్తున్న దృశ్యం

కోటబొమ్మాళి: స్థానిక కొత్తమ్మతల్లి ఆలయ సన్నిధిలో గురువారం 500 మంది భక్తులకు అన్నదానం నిర్వహించారు. దాతల సహకారంతో ప్రతి గురువారం అన్నదానం నిర్వహిస్తున్నట్లు ఈఓ వి.రాధాకృష్ణ తెలిపారు. విరాళాలు అందజేయాలనుకునే దాతలు ఆలయంలో సంప్రదించవచ్చని పేర్కొన్నారు.

క్రీడలతో స్నేహసంబంధాలు బలోపేతం



క్రికెట్ టోర్నీ ప్రారంభిస్తున్న వరప్రసాదరావు

కవిటి: క్రీడల నిర్వహణతో యువత మధ్య స్నేహ సంబంధాలు బలోపేతమవుతాయని రిటైర్డ్ డీఎస్పీ శమ్మళ్ల వెంకట వరప్రసాదరావు అన్నారు. గురువారం వింధ్యగిరి క్రీడామైదానంలో ఎస్‌జీఎఫ్ ఆధ్వర్యంలో నిర్వహించిన కవిటి, ఇచ్ఛాపురం మండలాలస్థాయి క్రికెట్‌టోర్నీ ప్రారంభోత్సవంలో పాల్గొన్నారు. వరప్రసాదరావు బ్యాటింగ్ చేయగా, ఇచ్ఛాపురం సర్కిల్ ఇన్‌స్పెక్టర్ ఇమాన్యుయేల్ రాజు బౌలింగ్ చేసి పోటీల్ని లాంఛనంగా ప్రారంభించారు. ఏటా సంక్రాంతి సందర్భంగా టోర్నీ నిర్వహిస్తున్న ఎస్‌జీఎఫ్ సంస్థ సేవలను ప్రశంసించారు.

నిరుపేదలకు వస్త్రాల వితరణ



టెక్కలి: మహిళలకు వస్త్రాలు పంపిణీ చేస్తున్న ట్రస్టు సభ్యులు



కాశీబుగ్గ: చీరలు పంపిణీ చేస్తున్న పైల జయలక్ష్మి

టెక్కలి:

పట్టణానికి చెందిన తథాగత సంఘమిత్ర చారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో గురువారం నిరుపేద మహిళలకు దుస్తులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా విశ్రాంత ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షుడు రామచంద్రరావు మాట్లాడుతూ మూడేళ్లుగా ట్రస్టు ఆధ్వర్యంలో సామాజిక కార్యక్రమాలు చేస్తున్నామని చెప్పారు. కార్యక్రమంలో ట్రస్టు చైర్మన్ పట్నాన చంద్రిక, ప్రతినిధులు చీపురు కృష్ణారావు, డి.శ్రీనివాసరావు, డి.వెంకటరావు, పి.సోమశేఖర్, శ్రీనివాసరావు, సూర్యుడమ్మ, లక్ష్మీ, పద్మ, లీనా, మల్లిక పాల్గొన్నారు.

కాశీబుగ్గ: మున్సిపాలిటీ పరిధిలోని 17వ వార్డులో తిలక్‌నగర్‌కు చెందిన వైఎస్సార్‌సీపీ నాయకురాలు పైల జయలక్ష్మి 20 మంది అనాథ మహిళలకు చీరలు, పండ్లు పంపిణీ చేశారు.

అభివృద్ధికి ప్రణాళికలే కీలకం



ఇచ్ఛాపురం రూరల్: సమావేశంలో మాట్లాడుతున్న ఈఓపీఆర్‌డీ సత్యనారాయణ



సోంపేట: సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ డాక్టర్ నిమ్మన దాస్



వజ్రపుకొత్తూరు: మాట్లాడుతున్న ప్రత్యేక ఆహ్వానితుడు ఉదయ్‌కుమార్

ఇచ్ఛాపురం రూరల్: పంచాయతీ అభివృద్ధికి సంబంధించి 2024–25 ఆర్థిక సంవత్సరానికి ముందస్తు ప్రణాళిక సిద్ధం చేయాలని ఈఓపీఆర్‌డీ కె.వి.ఎ.సత్యనారాయణ అన్నారు. గురువారం ఇచ్ఛాపురం ఎంపీడీఓ కార్యాలయంలో సర్పంచ్‌లు, పంచాయతీ కార్యదర్శులతో నిర్వహించిన శిక్షణ కార్యక్రమంలో మాట్లాడారు. 15వ ఆర్థిక సంఘ నిధులలో 15 శాతం మంచినీటి సరఫరా, 15 శాతం పారిశుధ్యం, 15 శాతం విద్యుత్, 10 శాతం రోడ్లు, 30–40 శాతం పారిశుధ్య కార్మికుల వేతనాలకు వెచ్చించాలని వివరించారు. కార్యక్రమంలో ఎంపీపీ బోర పుష్ప, మాజీ ఎంపీపీ కారంగి మోహనరావు, సీనియర్ సహాయకులు రామారావు పాల్గొన్నారు.

సోంపేట: గ్రామ పంచాయతీల అభివృద్ధికి గ్రామ సభలు నిర్వహించి ప్రణాళికలు సిద్ధం చేసుకోవాలని ఎంపీపీ డాక్టర్ నిమ్మన దాస్ అన్నారు. మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీడీఓ బెందాళం వెంకటరమణ ఆధ్వర్యంలో పంచాయతీ సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, సచివాలయ కార్యదర్శులకు జీపీడీపీ, బీపీడీపీ ప్రణాళిక తయారీపై శిక్షణ ఇచ్చారు. కార్యక్రమంలో వ్యవసాయాధికారి బి.నర్సింహమూర్తి, పంచాయతీ రాజ్ ఏఈ రమేష్, హౌసింగ్ ఏఈ శివరామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

వజ్రపుకొత్తూరు: మండల పరిషత్, పంచాయతీల అభివృద్ధి ముందస్తు ప్రణాళికలు తయారు చేయడంతో పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ సిబ్బంది కీలకమని మండల ప్రత్యేక ఆహ్వానితుడు ఉప్పరపల్లి ఉదయ్‌కుమార్ అన్నారు. మండల పరిషత్ కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులు, మండల స్థాయి అధికారులు, డిజిటల్ అసిస్టెంట్‌లతో ప్రణాళికా తయారీపై శిక్షణ ఇచ్చారు. కార్యక్రమంలో ఈఓపీఆర్‌డీ డి.తిరుమలరావు, వైస్ ఎంపీపీ వంక రాజు, సర్పంచ్ పుక్కళ్ల గురయ్యనాయుడు తదితరులు పాల్గొన్నారు.

● కిక్కిరిసిన రైల్వేస్టేషన్



సంక్రాంతి పండగకు సొంతూరికి వచ్చిన వారంతా తిరుగు ప్రయాణం చేపడుతున్నారు. దీంతో రైల్వే స్టేషన్లు, బస్టాండ్లు ప్రయాణికులతో కిక్కిరిసిపోతున్నాయి. ఈ క్రమంలో గురువారం ఇచ్ఛాపురం రైలు నిలయం కిటకిటలాడింది. స్టేషన్‌లో ఆగిన రైళ్లలో ఎక్కేందుకు ఎగబడ్డారు. -ఇచ్ఛాపురం

మహిళలను గౌరవించాలి



మాట్లాడుతున్న సీనియర్ సివిల్ న్యాయమూర్తి శ్రీనివాసరావు

సోంపేట: మహిళలను గౌరవించాల్సిన బాధ్యత అందరిపై ఉందని సీనియర్ సివిల్ న్యాయమూర్తి జె.శ్రీనివాసరావు అన్నారు. సోంపేట మండల పరిషత్ కార్యాలయంలో గురువారం మండల స్థాయి అధికారులు, సచివాలయాల సిబ్బందితో న్యాయవిజ్ఞాన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పని ప్రదేశాలలో మహిళా ఉద్యోగుల పట్ల మర్యాదగా మెలగాలన్నారు. మహిళలను ఇబ్బంది పెడితే కఠిన శిక్షలు తప్పవన్నారు. కార్యక్రమంలో అదనపు జూనియర్ సివిల్ న్యాయమూర్తి ఎ.రాము, ఎంపీడీఓ బి.వెంటరమణ తదితరులు పాల్గొన్నారు.

చింతాడ కుటుంబానికి మంత్రి పరామర్శ



కుటుంబ సభ్యులను పరామర్శిస్తున్న మంత్రి అప్పలరాజు

కాశీబుగ్గ: పలాస మండల మాజీ పీఏసీఎస్ అధ్యక్షుడు చింతాడ మాధవరావు తండ్రి, మాజీ పీఏసీఎస్ డైరెక్టర్ చింతాడ లోకనాథం అనారోగ్యంతో మరణించారు. సున్నాడలో ఉన్న ఆయన కుటుంబాన్ని మంత్రి డాక్టర్ సీదిరి అప్పలరాజు గురువారం పరామర్శించారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ జిల్లా కార్యదర్శి ఉంగ సాయికృష్ణ, ప్రభుత్వ విప్ గండు మోహనరావు, తర్లాకోట సర్పంచ్ కొర్ల సంతోష్, రైస్ మిల్లర్స్ అసోసియేషన్ కార్యదర్శి డొక్కి రామారావు, పైల సూర్యంబాబు తదితరులు పాల్గొన్నారు.

మృతుల కుటుంబాలకు ఓదార్పు



పరామర్శిస్తున్న ఎంపీపీ పైల దేవదాస్‌రెడ్డి

కంచిలి: మండలంలోని పెద్దశ్రీరాంపురం గ్రామంలో పత్రి నారాయణ(52), కింజరాపు లక్ష్మమ్మ(63) కిడ్నీ వ్యాధితో, బూటాడ రామారావు(53) ప్రమాదవశాత్తు మృతిచెందారు. వీరి కుటుంబాలతో పాటు కిడ్నీ బాధితులు మద్రిపాటి తులసీదాసు, జడ్డిడి లక్ష్మమ్మ, పత్రి వాసులు కుటుంబాలను ఎంపీపీ పైల దేవదాస్‌రెడ్డి గురువారం పరామర్శించారు. ఆయనతోపాటు మండల వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు వజ్జ మృత్యుంజయరావు, సర్పంచ్ బల్లెడ సుమన్, దుర్గాసి ధర్మారావు, లడ్డుకేశవ పాత్రో, తలగాన తిరుపతి, మద్రిపాటి ఆదినారాయణ ఉన్నారు.

ముగిసిన మంకినమ్మ ప్రీమియర్ లీగ్



విజేతలకు బహుమతులు అందిస్తున్న బళ్ల శ్రీనివాసరావు, కోచ్ ఉంగ కల్యాణ్

కాశీబుగ్గ: సంక్రాంతి సందర్భంగా కాశీబుగ్గ మంకినమ్మ క్రీడామైదానంలో నిర్వహించిన మంకిన్నమ్మ ప్రీమియం లీగ్ క్రికెట్ టోర్నీ గురువారంతో ముగిసింది. కాశీబుగ్గకు చెందిన రోయల్ లెవల్స్ విన్నర్‌గా నిలవగా, హరిపురం గ్రామానికి చెందిన ఎస్‌ఎస్‌కే వారియర్స్ రన్నరప్‌గా నిలించారు. 15వ వార్డు కౌన్సిలర్, పట్టణ జేసీఎస్ కన్వీనర్ బల్ల శ్రీనివాసరావు దొర చేతులమీదుగా బహుమతులు అందించారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ యువ నాయకులు ఉంగ కల్యాణ్, శ్రీకాంత్, మంకినమ్మ యూత్ కమిటీ సభ్యులు కార్తీక్, జగదీష్ తదితరులు పాల్గొన్నారు.

విగ్రహావిష్కరణ విజయవంతం చేయండి

ఇచ్ఛాపురం రూరల్: విజయవాడలో శుక్రవారం జరగనున్న అంబేడ్కర్ విగ్రహావిష్కరణ సభను విజయవంతం చేయాలని వైఎస్సార్‌సీపీ ఎస్సీసెల్ కార్యదర్శి సల్ల దేవరాజు పిలుపునిచ్చారు. గురువారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఇచ్ఛాపురం నియోజకవర్గం నుంచి ఎస్సీ, ఎస్టీ, బీసీ వర్గాల వారు అధిక సంఖ్యలో హాజరుకావాలని పిలుపునిచ్చారు.

కాశీబుగ్గ: విజయవాడ జరగనున్న అంబేడ్కర్ విగ్రహావిష్కరణకు సంఘీభావంగా కాశీబుగ్గ అంబేడ్కర్ విగ్రహం వద్ద శుక్రవారం ఉదయం 9 గంటలకు ప్రత్యేక కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు దళిత హక్కుల పరిరక్షణ సమితి పలాస శాఖ ప్రతినిధులు ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ సోదరులు హాజరుకావాలని పిలుపునిచ్చారు.

అ'పూర్వ' సమ్మేళనం



పలాస ప్రభుత్వ ఉన్నత పాఠశాల 1993-94 బ్యాచ్ పదో తరగతి పూర్వ విద్యార్థులు గురువారం ఒకే వేదికపై కలిశారు. తాము చదివిన పాఠశాలలోనే అప్పటి ఉపాధ్యాయులను సత్కరించారు. ఆనాటి జ్ఞాపకాలను ఒకరితో ఒకరు పంచుకున్నారు. కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు, అమలాపురం ఎస్పీ సుసరాపు శ్రీధర్, ఏఎంసీ అధ్యక్షుడు పి.వి.సతీష్‌కుమార్, పలాస-కాశీబుగ్గ మున్సిపల్ వైస్ చైర్మన్ బోర కృష్ణారావు, జిల్లా పీఈటీ సంఘ అధ్యక్షుడు పట్ట తవిటయ్య, పీఏసీఎస్ కార్యదర్శి రవికాంత్, కంచిలి డీటీ మొండిరాయవలస ఉమామహేశ్వరరావు, పండిత రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

- కాశీబుగ్గ

వేధింపులపై ఫిర్యాదు

సంతబొమ్మాళి: మండలం ఉమ్మిలాడకు చెందిన మూగు మానస అనే వివాహిత తన భర్త శివ, అత్తమామలు పోలారావు, శకుంతల, మరో ఇద్దరిపై పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు సంతబొమ్మాళి ఎస్సై మధుసూదనరావు గురువారం తెలిపారు. తనను శారీరకంగా, మానసికంగా నిత్యం వేధిస్తూ కొడుతున్నారని ఫిర్యాదులో పేర్కొన్నట్లు చెప్పారు. ఐదుగురిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.